# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 09.08.2025 | 24 క్యారెట్లు 10,332.00 | కిలో వెండి 1,26,900 | 29 °C | సంపుటి:3 | సంచిక:222

www.vishalabharati.com


## ప్రతీ నీటి బొట్టు మూసీలో చేరాలి: సీఎం రేవంత్ రెడ్డి



2 లో



## కాళేశ్వరం.. కాంగ్రెస్ దారెటు..

# బీజేపీ కోర్టులోకి బంతి?

### మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘట్టంపై రాజకీయ దుమారం

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఘోష్ నేతృత్వంలో కమిషన్
- దాదాపు 16 నెలలు విచారణ చేసి ఒక నివేదిక సమర్పించారు
- ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమైన అంశాలతో వివరించారు
- మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు పాత్రను తప్పుపట్టింది
- నివేదిక పేరుతో కొన్ని అరెస్టులు కూడా జరగవచ్చని కేసీఆర్ అంచనా
- హరీష్ రావు మరో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు
- నివేదికను ఆధారం చేసుకుని బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ దాడి పెంచింది

2 లో

తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘట్టంపై రాజకీయ దుమారం కొనసాగుతూనే ఉంది. బ్యారేజీ దెబ్బతిన్న విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసింది. దాదాపు 16 నెలలు విచారణ చేసి ఒక నివేదిక సమర్పించారు. ఇందులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావులతో పాటు పలువురు అధికారుల పాత్రను తప్పుపట్టింది.

- విశాలభారతి, స్టేట్ బ్యూరో



## కాళేశ్వరం రిపోర్ట్.. సీఎస్‌తో హరీష్ రావు భేటీ

- కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణను పూర్తి
- నివేదికను ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించారు
- దీనిపై ఇటీవల కేబినెట్ సమావేశం నిర్వహించారు
- కమిషన్ నివేదికను ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరింది
- హరీష్ రావు, కేసీఆర్ వేర్వేరుగా రిపోర్టును అందించాలని లేఖలు ఇచ్చారు
- హరీష్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు
- నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని బీఆర్ఎస్ చెప్పింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. ఇక తమ విచారణకు సంబంధించిన నివేదికను.. కమిషన్ సభ్యులు ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించారు. దీనిపై ఇటీవల కేబినెట్ సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. కమిషన్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేదానిపై కూలంకషంగా చర్చలు

మిగతా 2 లో



## బీజేపీలో ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

- బీఆర్ఎస్ పార్టీకి వరుస షాకులు తగులుతున్నాయి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు
- ఇప్పటికే 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి
- 10 ఏళ్ల ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయని కేసులు
- బీజేపీ కూడా అటు బీఆర్ఎస్‌పై.. ఇటు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా బీఆర్ఎస్‌కి గుడ్ బై
- బాలరాజు బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే గులాబీ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు.. కారు దిగి అధికార కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయిన సంగతి తెలిసిందే. దీంతోపాటు గత బీఆర్ఎస్ 10 ఏళ్ల ప్రభుత్వ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. కేసులు, సిట్‌లు, కమిషన్లు, విచారణలు, దర్యాప్తులు అంటూ ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దీనికితోడు బీజేపీ కూడా అటు బీఆర్ఎస్‌పై.. ఇటు

..మిగతా 2 లో

## బండి సంజయ్‌ను కోర్టుకు లాగుతా: కేటీఆర్

- మంత్రి బండి సంజయ్‌పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు
- థర్డ్‌క్లాస్ స్థాయి ఆరోపణలు చేయడం బండి సంజయ్ అలవాటన్నారు
- మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారు
- బాధ్యత గల పదవిలో ఉండి బేస్‌లెస్ ఆరోపణలు చేయడం అజ్ఞానం
- ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని బండి సంజయ్ గ్రహించాలన్నారు
- చీప్ పబ్లిసిటీ కోసం వీధి నాటకాలు ఆడుతున్నాడు



2 లో



## కేసీఆర్ కూతురు, అల్లుడిని కూడా వదల్లేదు..!

- బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట హాజరయ్యారు
- విచారణ తర్వాత బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు
- వావి వరసుల్లేకుండా ఫోన్లను ట్యాప్ చేశారని అన్నారు
- ట్యాపింగ్ కేసు నిందితులకు ఉరిశిక్ష వేసినా తప్పు లేదన్నారు
- ట్యాపింగ్ బాధితుల్లో హరీష్ రావు, కవిత కూడా ఉన్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బంధువుల ఫోన్‌లను కూడా ట్యాప్
- కేసీఆర్ అల్లుడి పేరు కూడా ఈ జాబితాలో ఉందన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
వావి వరసుల్లేకుండా, ఎవరు ఏమిటో చూసుకోకుండా ఫోన్లను ట్యాప్ చేశారని.. ట్యాపింగ్ కేసు నిందితులకు ఉరిశిక్ష వేసినా తప్పు లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. దాదాపుగా గంట సేపు విచారణ తర్వాత బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. తన ఫోన్లను ట్యాప్ చేసిన విధానం

..మిగతా 2 లో

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
శనివారం
09.08.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



## రేవంత్ రెడ్డి సోదరుడుకి జన్మదిన శుభాకాంక్షలు

**ఎల్బీనగర్, విశాలభారతి :**
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఏనుముల తిరుపతి రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా.



# కాళేశ్వరం.. కాంగ్రెస్ దారెటు.. బీజేపీ కోర్టులోకి బంతి?







అలాగే ప్రస్తుతం బీజేపీ ఎంపీ, ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కూడా ఆక్షేపించింది. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తదితర మంత్రుల సమక్షంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదికలోని ముఖ్యమైన అంశాల సారాంశాన్ని ఒక ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేసీఆర్ తన పార్టీ నేతల సమావేశంలో ఒక వ్యాఖ్య చేస్తూ అది కాంగ్రెస్ కమిషన్ అని ఆరోపించారు. ఈ నివేదిక పేరుతో కొన్ని అరెస్టులు కూడా జరగవచ్చని ఆయన అంచనా వేశారు. తదుపరి హరీష్ రావు బీఆర్ఎస్ పక్షాన మరో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో కమిషన్ చేసిన అబ్జర్వేషన్స్‌ను తప్పుపట్టారు. హరీష్ అలా చేయడం న్యాయ వ్యవస్థను కించపరచడమేనని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఈ వాద ప్రతివాదాలలో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అన్నదానిపై ఇప్పటికిప్పుడే ఒక అభిప్రాయానికి రాలేము.

ఈ సందర్భంలో గతంలో ఆయా ప్రభుత్వాలపై వేసిన కమిషన్‌లతో ఎవరికి ఇబ్బంది కలగలేదనే చెప్పాలి. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారెవ్వరూ ఈ తరహా కేసులు ఎదుర్కోలేదు. చలన చిత్రాభివృద్ధి సంస్థ అవకతవకలకు సంబంధించి జరిగిన కమిషన్ విచారణకు ఆనాటి మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి హాజరయ్యారు. కమిషన్ నివేదికలో ఆయనను తప్పు పట్టలేదు. ఒక భూ సేకరణ స్కాంలో విచారణ జరుగుతున్న సమయంలోనే ఇంకో మాజీ సీఎం స్టే పొందారు. విభజన తర్వాత ఏపీలో రాజమండ్రి పుష్కరాల తొక్కిసలాటలో 29 మంది మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబే విచారణ సంఘాన్ని నియమించుకున్నారు. అందులో ఆయనను కమిషన్ ఆక్షేపించలేదు. ఇప్పుడు కేసీఆర్ ఈ విచారణ సంఘం నివేదికను ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరం. రేవంత్ ప్రభుత్వం ఆయనపై కేసు పెడుతుందా? అరెస్టు చేస్తారా?.

ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్కాంలపై దర్యాప్తు జరిపించి అంతకుముందు సీఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడుపై కేసులు పెట్టింది. కొన్ని కేసుల్లో ఆయన బెయిల్ తెచ్చుకోగా, ఒక కేసులో అరెస్టు అయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళుతుందో అప్పుడే చెప్పలేం. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక కేసులో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లవలసి వచ్చింది. ఆ అనుభవం రీత్యా కేసీఆర్‌ను కూడా అరెస్టు చేస్తారా అన్న చర్చ ఉన్నప్పటికీ తాము కక్ష రాజకీయాలు చేయబోమని అంటున్నారు. పైగా కేసీఆర్‌కు ఫాం హౌసే ఒక జైలు అని, వేరే జైలు ఎందుకు అని వ్యాఖ్యానించి అరెస్టు జరగక పోవచ్చన్న సంకేతం ఇచ్చారు. ఇది ఒక్క కేసీఆర్‌కే వర్తిస్తుందా? హరీష్ రావు, ఇతర అధికారులకు కూడా వర్తిస్తుందా అన్నది చెప్పలేం. మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లు ఇచ్చి కుంగిన ఘటన కేసీఆర్, హరీష్‌రావులకు, బీఆర్ఎస్‌కు అప్రతిష్ట తెచ్చిందన్నది వాస్తవం.

అదే సమయంలో కేసీఆర్ లక్ష్య శుద్ధితోనే కాళేశ్వరం ప్రాజెక్టును సంకల్పించారని చెప్పాలి. కాకపోతే నిర్మాణం వేగంగా చేయాలన్న తొందరపాటులో ఆయన తీసుకున్న నిర్ణయాలు సమస్యలకు దారి తీసి ఉండవచ్చునని అనిపిస్తుంది. కమిషన్ పరిశీలనల్లో ముఖ్యమైనవి కొన్ని ఉన్నాయి. కాళేశ్వరం నిర్మాణంపై ప్రభుత్వ స్థాయిలో కాకుండా, కేసీఆర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారన్నది ఒకటి. మంత్రివర్గం నుంచి పాలనాపరమైన అనుమతులు తీసుకోలేదన్నది ఇంకో పరిశీలన. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని చెప్పి, బరాజ్‌ను మేడిగడ్డకు మార్చడంలో నిజాయితీ కొరవడిందన్నది మరో వ్యాఖ్య. మేడిగడ్డ వద్ద నిర్మాణానికి రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ వ్యతిరేకత తెలిపినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొందరు కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చే యత్నం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ తప్పుడు డిజైన్లు ఇచ్చిందన్నది వేరొక ఆరోపణ. అధిక వడ్డీకి రూ.84 వేల కోట్ల అప్పు చేయడాన్ని కూడా తప్పు పట్టారు. ఈ విషయాలను ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. శాసనసభలో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు.

ఘోష్ కమిషన్ నివేదికను ఆధారం చేసుకుని బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ దాడి పెంచింది. అయితే, వెంటనే ఏం చేయాలన్న దానిపై ఒక నిర్ణయానికి రాలేకపోయింది. అసెంబ్లీలో ఎటూ ఈ నివేదికను పెడతారు. అందులో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు తమ వైఖరికి అనుగుణంగానే మాట్లాడుతారు తప్ప కొత్తగా చెప్పేది ఉంటుందా అన్నది సందేహం. అయినా అసెంబ్లీలో చర్చించడం మంచిదే. ఈ నివేదికలో కొంతమంది కీలక అధికారుల పాత్ర గురించి విస్మరించారన్న వాదన ఉంది. ప్రస్తుత సీఎస్‌గా ఉన్న రామకృష్ణారావు జోలికి కమిషన్ వెళ్లలేదని చెబుతున్నారు. బారేజ్‌ను మేడిగడ్డకు మార్చడం వల్ల ఆరు వేల కోట్ల నష్టం జరిగిందని కమిషన్ అభిప్రాయపడిందని కథనం. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టుకు అయిన దాదాపు లక్ష కోట్ల వ్యయం వృథా అయినట్లే అన్నట్లు ముఖ్యమంత్రి మొదలు, మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తుండడం విశేషం. ఈ ప్రాజెక్టులో మరో రెండు బారేజీలు, కాల్వలు, టన్నెల్స్ తవ్వకం, రిజర్వాయర్ల నిర్మాణం వంటివి కూడా ఉన్న విషయాన్ని ప్రజలలోకి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారని అనిపిస్తుంది.

స్థల ఎంపికపై నిపుణుల కమిటీ అభిప్రాయాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో కేసీఆర్ వివరించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకువెళ్లనిచ్చిందన్న ప్రశ్న వస్తుంది. పైగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ ప్రాజెక్టుకు ప్రశంసించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్వయంగా ఈ ప్రాజెక్ట ప్రారంభోత్సవానికి హాజరై కేసీఆర్‌ను మెచ్చుకున్నారు. మరో పాయింట్ ఏమిటంటే ప్రస్తుతం కాంగ్రెస్ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంలో కూడా మంత్రిగా, కాళేశ్వరం సబ్ కమిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయన ఆ రోజుల్లో ఈ ప్రాజెక్టును సమర్థించినట్లే కదా!. దానిపై ఏం చెబుతారు?. ప్రాణహిత-చేవెళ్లకు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ ప్రాజెక్టును రికార్డు సమయంలో నిర్మాణం చేసి ఘనత తెచ్చుకోవాలన్న క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం కొన్ని తప్పులు కూడా చేసినట్లు అర్థం అవుతుంది.

అయితే, అవి పెద్ద తప్పులా? కాదా? అన్నది పరిశీలించాలి. ఈ నేపథ్యంలోనే రేవంత్ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది.. అది కూడా మంచిదే. మామూలుగా అయితే ఈ నివేదిక ఆధారంగా కేసులు పెట్టి ఉండవచ్చు. కానీ, అలా చేయకుండా అసెంబ్లీలో చర్చిస్తామని చెబుతున్నారు. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఈ ప్రాజెక్టుపై విచారణకు సీబీఐకి అప్పగించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం అలా చేస్తుందా? అన్నది ఒక ప్రశ్న. తద్వారా ఈ బాల్‌ను బీజేపీ కోర్టులో వేస్తుందా? అలా జరిగితే కాంగ్రెస్ చేతిలో ఒక ఆయుధం పోయినట్లు అవుతుంది. కనుక ఆ పని చేయకపోవచ్చు. ఇక్కడ మరో సంగతి చెప్పాలి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయి ఇంతకాలమైనా ప్రభుత్వం మరమ్మతులకు సరైన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్ల ప్రాజెక్టు నిరర్థకంగా మారే ప్రమాదం ఉంటుంది. ఉన్న ప్రాజెక్టును వినియోగించుకుంటూనే ప్రభుత్వం తదుపరి చర్యలకు వెళ్లితే మంచిదే.

ఇక మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వాదన కూడా సమర్థంగానే ఉందని చెప్పాలి. ఇది ఏకపక్ష నిర్ణయం కాదని, అసెంబ్లీలో కూడా చర్చ జరిగిందని ఆయన అంటున్నారు. కేబినెట్ ఆమోదం కూడా ఉందన్నది ఆయన వాదన. మొత్తం 665 పేజీల రిపోర్ట్ కాకుండా సంక్షిప్త నివేదికను బహిర్గతం చేస్తే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నిస్తున్నారు. తుమ్మిడి హెట్టి వద్ద నీటి లభ్యత సరిపడా లేదని కేంద్ర జల సంఘమే చెప్పిందని హరీష్ రావు వివరిస్తున్నారు. మరి కమిషన్ తన నివేదికలో అందుకు విరుద్ధంగా ఎలా పెట్టిందో తెలియదు. అలాగే మంత్రివర్గ ఆమోదం ఉందన్న హరీష్ వాదనకు కేబినెట్ తీర్మానాలు చూపించాల్సి ఉంటుంది. అసెంబ్లీలో చర్చ జరిగిన మాట అయితే వాస్తవం. దానిని కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదా అన్నది చూడాలి. ఎన్నికల ముందు చోటు చేసుకున్న ఈ ఉదంతం బీఆర్ఎస్‌కు నష్టం చేసింది.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలడం, పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిన ప్రమాదం వంటి వాటిని ఈ సందర్భంగా హరీష్, కేటీఆర్ తదితరులు ప్రస్తావిస్తున్నారు. గుజరాత్‌లో ఒక వంతెన కూలిన ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రజలు మరణించిన ఉదంతాన్ని కూడా ఉటంకిస్తున్నారు. ప్రమాదాలు జరిగితే దానిని ముఖ్యమంత్రికి అంటగడితే, ఇప్పుడు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనకు రేవంత్, ఉత్తమ్ కుమార్ బాధ్యత వహిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైతే మరీ తీవ్రమైన చర్య తీసుకుంటుందా అన్నది సందేహమే. రాజకీయంగా తమకు ప్రయోజనం అనుకుంటేనే అలా చేసే అవకాశం ఉంటుంది. కాకపోతే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. బీఆర్ఎస్ మాత్రం డిఫెన్స్ నుంచి అఫెన్స్ వెళ్లడానికి ప్రయత్నిస్తుంది.

అందుకే కేసీఆర్ దీనిని కాంగ్రెస్ కమిషన్ నివేదిక అని ధ్వజమెత్తితే, కేటీఆర్ ఈ నివేదిక ఒక ట్రాష్ అని వ్యాఖ్యానించారు. హరీష్ రావు ఇది రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు ఎలా ఉన్నా.. ఏ మాత్రం అవకాశం ఉన్నా వెంటనే ఆ బారేజీకి రిపేర్లు చేయించి, నీటిని ప్రజలకు అందుబాటులోకి తేవడం ఉపయుక్తం అని చెప్పాలి.

---

### ప్రతీ నీటి బొట్టు మూసీలో చేరాలి:
# సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తే వరద సమస్య పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- సంబంధించిన అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను సేకరించారు
- హైదరాబాద్ నగరం అతలాకుతలమైన పరిస్థితులను తెలుసుకున్నారు
- నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండటమే ఈ దుస్థితి కారణమని అధికారులు స్పష్టం
- దీనిలో భాగంగా అధికారులకు పలు సూచనలు చేశారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తే ఇబ్బందులకు, వరద సమస్య పరిష్కారంపై శుక్రవారం, ఆగస్టు 8వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తీసుకున్నారు. నిన్న (గురువారం, ఆగస్టు 7వ తేదీ) రాత్ర కురిసిన వర్షానికి హైదరాబాద్ నగరం అతలాకుతలమైన పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండటమే నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందన్న అధికారులు స్పష్టం చేశారు.

దీనిలో భాగంగా అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్.. ' ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ లోని వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్ నగరంలోని వరదనీరు మూసీని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయండి. ప్రతీ చెరువు, నాలాలు, ఇతర కాలువలను మూసీకి అనుసంధానం చేయండి.

చెరువులను పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయండి. ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా చర్యలు చేపట్టండి. భవిష్యత్ లో నగరంలో ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనం అవసరం.

మూసీ పునరుజ్జీవనమే వరద సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆ దిశగా ప్రణాళికలు రూపొందించండి. మూసీ పునరుజ్జీవనంతో వర్షాకాలంలో నీటి ప్రవాహం, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఆ దిశగా హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి' అని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు.

---

## బీజేపీలో ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేస్తూనే ఉంది. ఇక ఇటీవల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. రేపు బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో ఎందులో చేరాలని తర్జన భర్జన పడిన గువ్వల బాలరాజు.. చివరికి కాషాయ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు.

ఈ నేపథ్యంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు త్వరలోనే కాషాయ తీర్థం పుచ్చుకోనున్నట్లు వివరించారు. అయితే ఆ ఐదుగురు ఎమ్మెల్యేలు ఎవరు అనేది మాత్రం తెలంగాణ బీజేపీ చీఫ్ వెల్లడించలేదు. ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామని అన్నారు. వారు బీజేపీలో చేరే తేదీలతో సహా అన్ని వివరాలు వెల్లడిస్తామని రాంచందర్ రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేని ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు.

ఇక బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరేది ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రమే కాదని.. రానున్న రోజులు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఆగస్ట్ 10వ తేదీ (ఆదివారం) రోజున అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కాషాయ పార్టీలో చేరనున్నట్లు వివరించారు. ఇది బీజేపీలో చేరికలకు తొలి అడుగు మాత్రమేనని.. ఇక నుంచి వలసలు పెరుగుతాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ముందు కాషాయ తీర్థం పుచ్చుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక తెలంగాణలో హాట్ టాపిక్‌గా ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసుపైనా రాంచందర్ రావు స్పందించారు. ఈ కేసును సిట్ కాకుండా సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు ఎవరు అనేది బయటికి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో ఓడిపోతామనే భయంతోనే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలు నిర్వహించడం లేదని ఎద్దేవా చేశారు. ఇక దేశంలో ఓటర్ల జాబితా వివరాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు.. ఆయన అసహనానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి బీసీల మీద కొత్తగా ప్రేమ వచ్చిందంటూ రాంచందర్ రావు వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు.

---

# కేసీఆర్ కూతురు, అల్లుడిని కూడా వదల్లేదు..!

(మొదటి పేజీ తరువాయి)
చూసి తాను షాక్‌కు గురయ్యానన్నారు. మావోయిస్టుల ఫోన్ లు ట్యాప్ చేయాల్సింది పోయి మా ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. సిట్ అధికారులకు ఆధారాలు సమర్పించే సమయంలో నేనే షాక్ కి గురయ్యానని తెలిపారు. కేవలం నా ఒక్కడి ఫోనే అనేక సార్లు ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ బాధితుల్లో హరీష్ రావు, కవిత కూడా ఉన్నారని.. వావీవరసలు లేకుండా ఫోన్ ట్యాపింగ్ కి పాల్పడ్డారని విమర్శించారు.

బండి సంజయ్ తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యులు, సిబ్బంది, అనుచరుల ఫోన్‌లను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాప్ చేశారని తాను తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్‌కు అత్యధికంగా గురైన వ్యక్తిని అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బంధువుల ఫోన్‌లను కూడా ట్యాప్ చేశారని వెల్లడించారు. తన ఫోన్‌ను మావోయిస్టుల జాబితాలో చేర్చి ట్యాపింగ్ చేసినట్లు తెలిపారు. ఆశ్చర్యకరంగా, కేసీఆర్ అల్లుడి పేరు కూడా ఈ జాబితాలో ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సిట్‌కు తన వద్ద ఉన్న ఆధారాలు, సమాచారాన్ని అందజేసినట్లు బండి సంజయ్ తెలిపారు. సిట్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ వివరాలను వెల్లడించినప్పుడు తాను షాక్‌కు గురైనట్లు, భార్యాభర్తల ఫోన్‌లను కూడా ట్యాప్ చేసినందుకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని "మూర్ఖంగా" వ్యవహరించిందని విమర్శించారు.

బండి సంజయ్ సిట్ విచారణపై పూర్తి నమ్మకం లేదని, కాంగ్రెస్ , బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఈ కేసులో "డ్రామా" ఆడుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ బంధువులను కూడా సిట్ విచారణకు పిలవాలని సూచించినట్లుగా బండి సంజయ్ తెలిపారు. ఈ కేసులో సమగ్ర విచారణ జరగాలని, నిజాలు బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిట్‌కు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం లేదని ఆరోపించారు.

టీబీజేపీ చీఫ్‌గా ఎంపికయినప్పటి నుంచి తన చుట్టూ నిఘా పెట్టారన్నారు. తమ ఇంట్లో పని చేసే సిబ్బంది ఫోన్లూ సైతం ట్యాప్ చేశారన్నారు. ఈ ఫోన్ల ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస చీఫ్ కేసీఆర్ పాత్ర ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో సామాన్యులు సైతం ఫోన్లు మాట్లాడ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో భార్యాభర్తల ఫోన్ సంభాషణలూ కూడా విన్నారంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాత్ర నేరుగా ఉంటే... ఆయనను అరెస్టు చేసేది లేదని రేవంత్ అంటున్నారని.. అలా చెప్పడానికి ఆయనెవరని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులను రేవంత్ ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. న్యాయమూర్తుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లుగా బండి సంజయ్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీక్ కేసు విచారణ చేస్తున్న జడ్జి ఫ్యోన్ కూడా ట్యాప్ చేశారన్నారు. వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో దొరికిన నగదంతా కేసీఆర్ ఖాతాల్లోకి వెళ్లాయని ఈ కేసును ఇంకా ఎంత కాలం సాగదీస్తారు? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

---

## బండి సంజయ్‌ను
# కోర్టుకు లాగుతా: కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తూ అన్ని హద్దులు దాటిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. మినిమం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ స్థాయి ఆరోపణలు చేయడం బండి సంజయ్ అలవాటుగా మార్చుకున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాజకీయాల్లో చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు.

కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు నిఘా వ్యవస్థల పనితీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత జ్ఞానం కూడా లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బాధ్యత గల పదవిలో ఉండి ఇంత బేస్‌లెస్ ఆరోపణలు చేయడం ఆయన అజ్ఞానం, నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. "కేంద్ర మంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని బండి సంజయ్ ఇప్పటికైనా గ్రహించాలి" అని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన ప్రతిసారి బండి సంజయ్ మరింత దిగజారుతున్నారని, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. "రాజకీయాల్లో పెద్ద జోకర్‌గా మారిన బండి సంజయ్ మీడియా హెడ్‌లైన్ల కోసం, చీప్ పబ్లిసిటీ కోసం, వీధి నాటకాలు ఆడుతున్నాడు" అని ఘాటుగా విమర్శించారు.

**48 గంటల గడువు.. కోర్టుకిడుస్తామని హెచ్చరిక**

బండి సంజయ్ ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. తక్షణమే ఆ ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల పైన లీగల్ నోటీసు పంపిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ డిమాండ్‌ను పట్టించుకోకపోతే, 48 గంటల గడువు తర్వాత కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్ అనే అంశం ఎంత సున్నితమైనదో, చట్టపరంగా ఎంత కఠినమైనదో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలవకుండానే, కావాలనే వాస్తవాలను వక్రీకరిస్తూ, సాక్ష్యం లేకుండా ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. "తప్పుడు ఆరోపణలు, బజారు స్థాయి మాటలు, చవకబారు పబ్లిసిటీ కోసం చెప్పే అబద్ధాలు %-% ఇవన్నీ బండి సంజయ్ కు అలవాటు అయిన రాజకీయాలని, ఇక పైన ఇలాంటి చౌకబారు ఆరోపణలను సహించేది లేదని కేటీఆర్ ఘాటుగా హెచ్చరించారు.

---

# కాళేశ్వరం రిపోర్ట్.. సీఎస్‌తో హరీష్ రావు భేటీ

- కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణను పూర్తి
- నివేదికను ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించారు
- దీనిపై ఇటీవల కేబినెట్ సమావేశం నిర్వహించారు
- కమిషన్ నివేదికను ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరింది
- హరీష్ రావు, కేసీఆర్ వేర్వేరుగా రిపోర్టును అందించాలని లేఖలు ఇచ్చారు

(మొదటి పేజీ తరువాయి)
జరిపారు. ఈ క్రమంలోనే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను తమకు కూడా ఇవ్వాలని బీఆర్ఎస్.. ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు హరీష్ రావు, కేసీఆర్ వేర్వేరుగా.. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తయారు చేసిన రిపోర్టును అందించాలని లేఖలు ఇచ్చారు.

ఈ క్రమంలోనే శుక్రవారం రోజున మాజీ మంత్రి హరీష్ రావు.. స్వయంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు పార్టీ నేతలతో కలిసి.. రాష్ట్ర సచివాలయానికి వెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన పూర్తి రిపోర్ట్‌ను ఇవ్వాలని సీఎస్ రామకృష్ణారావును కోరారు. సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావును కలిసిన హరీష్ రావు.. జస్టిస్ ఘోష్ ఇచ్చిన 665 పేజీల రిపోర్టు పత్రాలను ఇవ్వాలని వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా లేఖలు ఇచ్చినట్లు రశీదులు కూడా తీసుకున్నారు.

కాళేశ్వరం కమిషన్ రిపోర్టు కావాలని హరీష్ రావు చేసిన విజ్ఞప్తిని పరిశీలించి.. దానికి త్వరలోనే సమాధానం చెబుతామని సీఎస్ రామకృష్ణారావు చెప్పినట్లు తెలుస్తోంది. హరీష్ రావు వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డిలతోపాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సహా పార్టీ నాయకులు ఉన్నారు.

మరోవైపు.. ఇటీవల కేబినెట్ భేటీలో చర్చించిన తర్వాత.. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని రేవంత్ రెడ్డి సర్కార్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఊరు, పేరు మార్చి.. ముందస్తు అంచనాలను మించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని.. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన తర్వాత ఏం చేయాలి అనేది నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వం తేల్చి చెప్పింది.

ఈ నేపథ్యంలోనే కమిషన్ రిపోర్టు అసెంబ్లీలో పెట్టకముందే.. అందులో ఏం ఉందో తెలుసుకుని.. పరిశీలించాలని బీఆర్ఎస్ పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే.. ముందుగానే ఆ రిపోర్టును తీసుకుని.. కమిషన్ ఏం చెప్పిందనే విషయాలను అధ్యయనం చేయాలని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. అయితే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఇప్పటికే అనేకసార్లు బీఆర్ఎస్ చెప్పింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం
09.08.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## బీసీ హక్కుల సాధన సమితి నియోజకవర్గ కన్వీనర్ గా ఎన్నికైన కిరణ్



**తిరుమలగిరి, విశాలభారతి:**
శుక్రవారం తిరుమలగిరిలో జరిగిన బీసీ కులాల గణన తేల్చకుండా రాజకీయంగా విద్యాపరంగా ఉద్యోగపరంగా బీసీ కులాలను నిర్వీర్య పరచారని ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టి బీసీ కులాల లెక్కలు తేల్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరంటున్నట్టుగా వ్యవహరిస్తూ బీసీల రిజర్వేషన్ను అమలుపరచడం లేదని అన్నారు. వెంటనే బీసీ కులాల రిజర్వేషన్ పై చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి సెక్రటరీ ధనుంజయ, సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# రహదారి మరమ్మత్తులను
# పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హయత్ నగర్ వీరభద్ర కాలనీ ముఖద్వారం వద్ద ఉన్నటువంటి 1200ఎమ్ ఎమ్(డి ఐ ఏ ) భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ పగిలి రోడ్డు కుంగిపోవడం జరిగిందని సమాచారం రావడంతో రాత్రివేళలా హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించిన స్థానిక హయత్ నగర్ డివిజన్ కార్పోరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , శుక్రవారం ఉదయం పోలీస్, జలమండలి జాతీయ రోడ్డు విస్తరణ అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు విస్తరణ పనులు నిలకడగా జరుగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ రహదారి సర్వీస్ రోడ్లకి ఆనుకొని ఉన్నటువంటి కాలనీలకు కనెక్టివిటీ వద్ద బీటీ రోడ్ నిర్మాణం చేయకపోవడంతో అనునిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వారు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. కావున వెంటనే సర్వీస్ రోడ్లకు ఆనుకొని ఉన్నటువంటి కాలనీలా ఎంట్రన్స్ వద్ద బీటీ రోడ్ల కనెక్టివిటీ నిర్మాణం చేపట్టాలని వారు అధికారులకు తెలిపారు. అదేవిధంగా వర్షాకాలంలో జి హెచ్ యం సి, జలమండలి, పోలీస్ శాఖ, హైడ్రా, విద్యుత్ శాఖ, అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వాతావరణ శాఖ సూచన మేరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్న సమయంలో భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్, వరద నిట్టి కాలువలు,విద్యుత్ స్తంభాల వద్ద తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వర్షాలు పడినప్పుడల్లా అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస కుమార్ , ట్రాఫిక్ సిఐలు శ్రీనివాస్ , గట్టు మల్లు , సి ఐ శెట్టి శ్రీను , జాతీయ రహదారుల హయత్ నగర్ డిఇ బాలు నాయక్ , జలమండలి మేనేజర్ రాజు , హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలలో అధికారులు సిబ్బందితో సమస్యలను పరిష్కరించాలి

### GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి



**ఎల్బీనగర్, విశాలభారతి:**
మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల కాలనీలను GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి స్వయంగా పలు ప్రాంతాలను సందర్శించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా, రోడ్లపైకి పొంగుతున్న డ్రైనేజీ మురుగునీటి సమస్య పై HMWS & SB అధికారులకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తక్షణమే పరిష్కరించాలనే ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతమైన గణేష్ నగర్ కాలనీ ఫేస్-1లో గతంలో నీళ్లు నిలిచి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండెనని నిర్దిష్టమైన ప్రణాళికలో భాగంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ వేయడం వలన స్థానికులకు ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. డ్రైయినేజీ వ్యవస్థ పొంగి క్రింద ఉన్నటువంటి వీకర్ సెక్షన్ కాలనీలో విపరీతమైన మురుగునీరు రోడ్లపై పారుతుందని వెంటనే HMWS & SB అధికారులు సిబ్బందితో సమస్యను పరిష్కరించాలని అన్నారు. వీకర్ సెక్షన్ కాలనీ వాసులు వర్షం పడగానే ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని KBR కన్వెన్షన్ హాల్ వెనక నుండి 80.00 లక్షల నిధుల రూపాయలతో స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ పనులు తొందర్లోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో

## ఘరానా మోసం



**మేడిపల్లి, విశాలభారతి:**
మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పీర్జాది గూడలో నివసించే వెలిశెట్టి నాగరాజు తాను డబుల్ బెడ్రూం కాంట్రా క్టర్ను అని, పొలిటికల్ లీడర్లు అంతా తెలుసని నమ్మబ లికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని ఘరానా మోసం చేశాడు. ప్రతాప్సింగారం లో 2 ఏళ్ల క్రితం ఒక్కొక్కరి నుండి రూ.లక్ష చొ ప్పున సుమారు 30 మంది దగ్గర వసూలు చేశాడు. అప్పటి నుండి నాగరాజు బాధితులకు మాయమా టలు చెబుతూ అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీంతో మోసపోయామని గ్ర హించిన బాధితులు తమ డబ్బు తిరిగి ఇవ్వ మని కోరడంతో నాగరాజు బాధితులకు కనిపించకుండా తిరుగుతున్నాడు. కాగా, ఇవాళ బాధితులు నాగరాజు ఇంటివద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.

## సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమం



**చౌటుప్పల్, విశాలభారతి:**
పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మహిళా భక్తులచే సామూహిక వ్రతము కుంకుమార్చన నిర్వహించడం జరిగినది. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 400 మంది మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతము వేద పండితులు సుధాకర్ శర్మ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున మహిళా భక్తులు దేవాలయానికి వచ్చి తమ సౌభాగ్యాన్ని కాపాడాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన ప్రతి మహిళ కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామచంద్రస్వామి దేవాలయం కమిటీ ధర్మకర్తలు సభ్యులు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా,గుర్రం వెంకటేశం,వర్కాల వెన్నెల రవి గౌడ్,తూర్పుంటి నరసింహ మహిళా భక్తులు చింతల విజయలక్ష్మి,చింతల కర్ణా శ్రీ,ఉప్పల కుసుమ వరలక్ష్మి వ్రత కార్యక్రమం సహకరించిన పూజా సామాగ్రి దాతలు గుర్రం విమల వెంకటేశం మహిళా భక్తులకు వాటర్ బాటిల్స్ దాతలు ట్రినిటీ విద్యాలయాల యజమాన్యం కే వి బి కృష్ణారావు డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మరియు మహిళా భక్తులు భక్తులు లత,దేవరపల్లి కర్ణ నిర్మల,ఉప్పల దీపిక,కాసాని ఐలమ్మ,బద్దం స్వప్న,సాధన, సింగిరెడ్డి రజిత,విశ్వనాధుల ఝాన్సీ, బొబ్బిళ్ళ యశోద, వరగంటి మమత, బడుగు గౌరీశ్వరి,వీరమల్ల అశ్విని, చెరుకు జయలలిత, దాచేపల్లి లక్ష్మి,జెల్ల సుజాత,మన్నే శివరాణి,పెద్ది స్వాతి,సోమవారం లక్ష్మి,వనపర్తి పావని భక్తుల లావణ్య,బాలగోని ప్రగతి, రాజపేట శ్రీలత, గంజి అనసూయ,స్వాతి, మరి దేవరాయ అర్చకులు రోహిత్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కళాశాలకు డ్యూయల్ డే స్కుల వితరణ

**ఆర్మూర్, విశాల భారతి:**
నందిపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పిఎసిఎస్ మాజీ చైర్మన్ సిద్దాపురం (మీసాల) లక్ష్మీనారాయణ, యువకుల ఆధ్వర్యంలో దాతల సహాయంతో ఇరువై డ్యూయల్ డే స్కులను శుక్రవారం వితరణ చేశారు. విద్యార్థులకు సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో డేస్కులను పంపిణీ చేశారు. సుమారు విటి విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుందని తెలిపారు. డే స్కులు పంపిణీ చేసిన దాతలకు కళాశాల ప్రిన్సిపల్ చిన్నయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డే స్క్ దాతలు సిద్దాపురం లక్ష్మీనారాయణ, బ్యాంకు రవి, రంజిత్, అవధూత మధు, రుమ్మ సంజీవ్ (కానిస్టేబుల్) మగ్దుమ్ పాషా, నరహరి, ధమ్మారెడ్డి ప్రతాప్, ఇందూరు శ్రీనివాస్, ఎర్రటి శ్రీనివాస్, మినుకూరి సాయిలు, రాజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సందీప్, అవధూత రాజు, దాసరి సత్యంధర్, సిద్దాపురం సంజీవ్, నీలం గోపి, నవీన్ పోగుల సాయి కృష్ణ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## హిమాయత్ సాగర్ నాలుగు గేట్లు ఓపెన్

### మూసి పరివాహక ప్రాంతాలకు అలర్ట్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**
గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ సాగర్ జలాశయం నాలుగు గేట్లను అధికారులు శుక్రవారం తెరిచారు. ఎగువ ప్రాంతం నుంచి రిజర్వాయర్ లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది ఈ నేపథ్యంలో నాలుగు గేట్లు ఎత్తి 1400 క్యూసెక్కుల నీటిని మూసి లోకి వదిలారు. అయితే గురువారం రాత్రి ఒక గేటును ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎత్తడం జరిగింది కానీ ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రభావం పెరగడంతో ఉదయం మరో మూడు గేట్లు ఎత్తడం జరిగింది. హిమాయత్ సాగర్ ఎఫ్టీ ఎల్ 1763.50 ఫీట్లు కాగా ప్రస్తుతం 1763.10 ఫీట్ల నీరును అధికారులు మెయింటెన్ చేస్తున్నారు. హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తడంతో మూసి పరివాహక ప్రాంతలకు అధికారులు అలర్ట్ జారీ చేశారు. మరో రెండు గేట్లు ఎత్తితే మూసి పరివాహక ప్రాంతంల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయిస్తామని ఆదికారులు పేర్కొన్నారు.




## స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో రాఖీ వేడుకలు

**మహబూబాబాద్, విశాలభారతి:**
మహబూబాబాద్ పట్టణ బైపాస్ రోడ్డులో ఉన్న స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్లో రాఖీ పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థినీలు తమ సహవిద్యార్థులకు స్వయంగా తయారు చేసిన రాఖీలు కట్టి, అన్నా-చెల్లెళ్ల ప్రేమ బంధాన్ని మమేకంగా చూపించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ ప్రేమతో, నవ్వులతో నిండి సాంస్కృతిక ఉత్సవ వాతావరణాన్ని తలపించింది. ప్రధానోపాధ్యాయులు రాఖీ వెనుక ఉన్న పురాణ కథనాలను వివరిస్తూ, ద్రౌపది-శ్రీకృష్ణుల బంధాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. చైర్మన్ కె.చంద్రమౌళి, ప్రిన్సిపాల్ దాసరి మధులు మాట్లాడుతూ విద్యతో పాటు మానవీయ విలువలు పెంపొందించాలన్నదే లక్ష్యమన్నారు. విద్యార్థుల చేతులతో తయారైన రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల సాన్నిధ్యం, పిల్లల సృజనాత్మకత, ఉపాధ్యాయుల ప్రోత్సాహం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. ఈ వేడుక విద్య, సంస్కృతి, అనుబంధాలకు గొప్ప నిదర్శనంగా నిలిచింది.



## జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది సేవలు అభినందనీయం

### జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్

**ఎల్బీనగర్, విశాలభారతి:**
జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది సేవలు అభినందనీయమని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని అనుపమ నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో శుక్రవారం జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందికి జిహెచ్ఎంసి నుండి పంపిణీ చేస్తున్న రక్షణ పరికరాలను కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం కాలనీలో పరిశుభ్రత పాటిస్తూ కాలనీవాసులకు ఎంతో మేలు చేస్తున్నారని తెలిపారు. వారు బాగుంటేనే కాలనీలో శుభ్రంగా ఉంటాయని సుజాత నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

